
సాక్షి బాపట్ల

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



వేంకటేశ్వర స్వామికి పూజలు

మాచర్ల: మాచర్ల బస్టాండ్ సెంటర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక అర్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 534.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఈవీఎం వీవీప్యాడ్స్ పరిశీలన

ఫిరంగిపురం: రేపూడిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపర్చిన ఈవీఎం వీవీప్యాడ్స్‌ను ఆర్డీఓ శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు.

న్యూస్‌రీల్

సాగర్ కుడి కాలువ పరిధిలో వారబందీ అమలు

నరసరావుపేట:నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గినందున సాగర్ కుడికాలువ పరిధిలో వారబందీ అమలు చేస్తున్నట్లు ఎన్‌ఎస్పీ ఈఈ డీవీ సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారబందీలో భాగంగా పక్షంలో తొమ్మిది రోజులు లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని కాలువలకు మాత్రమే సరఫరా చేస్తామని తెలిపారు. వారబందీ అమలులో భాగంగా ఈనెల 28 నుంచి లింగంగుంట్ల సర్కిల్ పరిధిలోని 10ఆర్ మేజర్ కాలువ, పెదనందిపాడు బ్రాంచ్ కాలువ(పీబీసీ), అద్దంకి బ్రాంచ్ కాలువ(ఏబీసీ)లకు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అవసరం మేరకు వాడుకొని, నీటి వృథాను అరికట్టాలని రైతులకు సూచించారు.

వీరాంజనేయస్వామి హుండీ ఆదాయం రూ.89,065



నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న వీరాంజనేయస్వామి ఆలయంలోని హుండీని శనివారం కమిటీ సభ్యులు లెక్కించారు. హుండీ ఆదాయం రూ.89,065 వచ్చినట్లు తెలిపారు. దేవస్థానం మూడో వార్షికోత్సవం ఈనెల 14, 15 తేదీల్లో వైభవంగా జరిగిన విషయం విదితమే. వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారిని చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కాట్రు శ్రీనివాసరావు, సభ్యులు నన్నపనేని శ్రీనివాసరావు, కాట్రు కృష్ణారావు, శివరామకృష్ణ, కె శ్రీనివాసరావు, శ్రీపతి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

భృంగి వాహనంపై మల్లేశ్వరుడు



మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శనివారం 5వ రోజు స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళగిరి తహసీల్దార్ కె.దినేష్ రాఘవేంద్ర ప్రత్యేక పూజలు చేశారు. మాజేటి సూర్య వేణుగోపాల కృష్ణ దంపతులు, ఎల్‌కే శర్మ దంపతులు ఉత్సవ కైంకర్య పరులుగా వ్యవహరించారు. దేవస్థాన ఈవో జె.వి. నారాయణ వేడుక నిర్వహణను పర్యవేక్షించారు.

గోవాడలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



అమర్తలూరు(వేమూరు): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా అమర్తలూరు మండలం గోవాడ గ్రామంలో వేంచేసియున్న బాల కోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు పడకుండా ఉండేందుకు ఆలయంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వీఐపీలకు ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని దేవస్థానం కార్య నిర్వహణాధికారి అశోక్ కుమార్ తెలిపారు. ప్రతి క్యూ లైన్ వద్ద పురుషులు, మహిళా కానిస్టేబుళ్లను నియమిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధైర్యపడకుండా శ్రీ బాలకోటేశ్వరస్వామి కటాక్షం పొందాలని కోరారు. 26వ తేదీ రాత్రి భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

25న ఉమ్మడి జిల్లా ఫెన్సింగ్ జట్లు ఎంపిక

లక్ష్మీపురం:గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అండర్–14 బాల బాలికల ఫెన్సింగ్ టీంల ఎంపిక ఈనెల 25న నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి డి.అశోక్‌బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పొత్తూరులోని ఏసీఎంఈ స్కూల్‌లో నిర్వహించే ఎంపికలకు ఉమ్మడి జిల్లాలోని 14 ఏళ్ల వయసు కలిగి ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు కలిగి వారు అర్హులని ఆయన తెలిపారు.

"ఏరా అబ్బాయిలూ మా ఊరికి కూడా వచ్చారా.. ఈ ఊళ్లో మీకెవర్రా ఓట్లేసేది? వెళ్లండి.. వెళ్లండి..మీకు ఓట్లున్న దగ్గరికి?" అంటూ పీడీఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు ఓట్లేయాలని అడిగేందుకు వేమూరు నియోజకవర్గంలోని ఒక గ్రామంలో పర్యటిస్తున్న ఆయన మద్దతుదారులను ఉద్దేశించి పచ్చ పార్టీ నేత చేసిన వ్యాఖ్యలు.

"ఒక్కరోజు ఆగండి డబ్బులొస్తున్నాయి. ఓటుకు రూ.5 వేలు చొప్పున ఇస్తాం. వైఎస్సార్ సీపీ నేతలు పిలిచినా పలకవద్దు. అధికారంలో ఉన్నది మేమే. మీకు ఏ పథకం ఆగకుండా అందాలంటే మాకు ఓటేయండి." అంటూ బాపట్ల రూరల్ మండలంలోని ఓ గ్రామంలో శనివారం ఉదయం పట్టభద్రుల ఓటర్లనుద్దేశించి స్థానిక పచ్చ పార్టీ నేత మాట్లాడిన మాటలు.

"మీరు సక్రమంగా ఉద్యోగం చేసుకోవాలంటే ఈ ఐదేళ్లు మా సపోర్టు కావాలి. ఉద్యోగులందరికీ చెప్పండి. మీకు అవసరమైన పని చేసిపెడతాం. కాదంటే ఇబ్బందులు తప్పవు" అంటూ రేపల్లె నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు పచ్చపార్టీ ముఖ్యనేత బెదిరింపులు.

ప్రలోభాలు..బెదిరింపులు

- ఓట్లు వేయకుంటే కష్టాలే
- బదిలీలు తప్పవని ఉద్యోగులకు హెచ్చరికలు
- రేపల్లె, వేమూరు ప్రాంతాల్లో పీడీఎఫ్ మద్దతుదారులకు బెదిరింపులు
- ఖాతరు చేసేదిలేదంటున్న ఉద్యోగులు, పట్టభద్రులు
- నిరుద్యోగులకు డబ్బు ఎర
- ఓటుకు రూ.5 వేలు ఇస్తామంటూ ప్రలోభాలు
- అవసరమైన చోట ఎక్కువ మొత్తం ఇచ్చేందుకు సన్నద్ధం
- పీడీఎఫ్ అభ్యర్థికి పెరుగుతున్న మద్దతు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం కూటమి అడ్డదారులు



సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఇలా చెప్పుకుంటూ పోతే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పచ్చపార్టీ బెదిరింపుల పర్వానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మొన్నటి వరకూ గెలుపు మాదేనన్న గర్వంతో ఉన్న మాజీ మంత్రి, పచ్చపార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు పీడీఎఫ్ అభ్యర్థి కే.ఎస్.లక్ష్మణరావు చుక్కలు చూపిస్తున్నారు. టీడీపీ అభ్యర్థి పచ్చపార్టీ కేడర్‌ను నమ్ముకుంటే పీడీఎఫ్ అభ్యర్థి ఉద్యోగులు, పట్టభద్రులతోపాటు ప్రజలను నమ్ముకున్నారు. ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలతోపాటు ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కూటమి సర్కార్ తుంగలో తొక్కడంతో ఇప్పుడు అన్ని వర్గాల మద్దతు పీడీఎఫ్ అభ్యర్థికి లభిస్తోందన్నది విశ్లేషకుల అంచనా. దీంతో బెంబేలెత్తిన పచ్చపార్టీ బెదిరింపులు, ప్రలోభాలతో ఎన్నికల్లో నెగ్గేందుకు సన్నద్ధమైంది. ఇందులో భాగంగా ఒక్కొక్క ఓటుకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు పంచేందుకు పచ్చ నేతలు సిద్ధమయ్యారు. బాపట్ల నియోజకవర్గంలో రూ.5 వేలు పంచుతున్నట్లు పచ్చపార్టీ నేత ప్రచారం చేస్తుండగా వేమూరులో రూ.3 వేలు, రేపల్లెలో రూ.5 వేలు పంచనున్నట్లు అక్కడి పచ్చనేతలు ప్రచారం చేస్తున్నారు.

టీడీపీ అభ్యర్థి ఆలపాటి డబ్బులు ఇవ్వాలని, అంత మొత్తంలో సొంతంగా పంచడం సాధ్యం కాదని ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు మెలిక పెట్టినట్లు సమాచారం. డబ్బుల పంపిణీ విషయంలో రేపటిలోగా నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యేలకు మంత్రులు తెలిపినట్లు తెలుస్తోంది. పీడీఎఫ్ చాపకింద నీరులా ముందుకు వెళుతోందని, ఈ సమయంలో అసమ్మతి, అసంతృప్తులని కూర్చుంటే నిండా మునుగుతామని మంత్రులు ఎమ్మెల్యేలకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినట్లు సమాచారం. టీడీపీ అభ్యర్థి ఈ ఎన్నికల్లో ఓడితే పరువు గంగలో కలవడం సంగతి దేవుడెరుగు ప్రతిపక్ష వైఎస్సార్ సీపీని నిలువరించడం సాధ్యంకాదని మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి రవికుమార్‌లు ఎమ్మెల్యేలకు చెప్పినట్లు సమాచారం.

పచ్చ నేతల తీరుపై మిత్రుల ఆగ్రహం

కూటమి విజయానికి అహర్నిశలు శ్రమించినా అధికారంలోకి వచ్చాక తమను పచ్చపార్టీ దూరం పెట్టిందని జనసేన, బీజేపీలు ఆగ్రహంతో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పచ్చపార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసి తమ ప్రాధాన్యత తెలియజెప్పాలని ఆయా పార్టీల కేడర్ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పచ్చపార్టీ అభ్యర్థి ఆలపాటి గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నట్లు సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అన్నివర్గాల మద్దతుతో పీడీఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు ముందంజలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

రగులుతున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం

ఈ ఎన్నికలకు కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలతోపాటు పచ్చపార్టీ కేడర్ చాలా వరకు అభ్యర్థి ఆలపాటికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు సిద్ధమైనట్లు ఆ పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. ఒకప్రక్క పచ్చపార్టీ ముఖ్యనేతలు కూటమి అభ్యర్థి ఆలపాటి రాజా విజయానికి పనిచేస్తుంటే అసంతృప్తులతో రగిలిపోతున్న పచ్చపార్టీ ముఖ్యనేతలతోపాటు ద్వితీయ శ్రేణి నేతలు ఆలపాటిని ఓడించి అధిష్టానానికి కనువిప్పు కలిగించాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

సర్కారుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధం

పచ్చపార్టీ బెదిరించినా, ప్రలోభపెట్టినా ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత పెంచుకున్న ఉద్యోగులు వినే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో డబ్బులు ఎంతైనా ఖర్చుచేసి నిరుద్యోగులతోపాటు ఉద్యోగులను కొనుగోలు చేసేందుకు పచ్చపార్టీ వ్యూహం రచించింది. అయితే పీడీఎఫ్ అభ్యర్థి కే.ఎస్.లక్ష్మణరావును గెలిపించి సార్వత్రిక ఎన్నికల వేల హామీలు ఇచ్చి వంచించిన కూటమి సర్కార్‌కు తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు ఉద్యోగులతోపాటు పట్టభద్ర ఓటర్లందరూ సన్నద్ధమైనట్లు క్షేత్రస్థాయి పరిస్థితులున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

చేతులెత్తేసిన ఆలపాటి రాజా

ఎమ్మెల్యేలపైనే ఎన్నికల ఖర్చుల భారం

సాక్షి ప్రతినిధి,గుంటూరు:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తమకు తలనొప్పిగా మారాయని కూటమి ఎమ్మెల్యేలు వాపోతున్నారు. ఈ నెల 27వ తేదీన ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి మాజీ మంత్రి ఆలపాటి రాజాకు పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావుకు మధ్య హోరాహోరీగా పోటీ నడుస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న లక్ష్మణరావు పనితీరు పట్ల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, పట్టభద్రులలో సానుకూల అభిప్రాయం ఉంది. కూటమిలోనే కొన్ని పక్షాలు లక్ష్మణరావుకు మద్దతుగా నిలుస్తున్నాయి. ఆయన నామినేషన్ రోజున జనసేన పార్టీకి చెందిన నేతలు మద్దతు ప్రకటించి వెళ్లిన సంగతి తెలిసిందే.

ఒక్కసారిగా ప్లేటు ఫిరాయింపు

ఆలపాటి విషయంలో పార్టీలోనే తలనొప్పులు ఉన్నాయి. పొన్నూరు ఎమ్మెల్యే డి.నరేంద్ర తొలి నుంచి ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడంతోపాటు ప్రచారానికి దూరంగా ఉంటూ వస్తున్నారు. దీంతో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును రంగంలోకి దించి ప్రచారం చేయిస్తున్నారు. పరిస్థితులు వ్యతిరేకంగా మారుతుండటంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. రెండు జిల్లాల ప్రజాప్రతినిధులతో రెండుసార్లు భేటీ అయ్యారు. ఆలపాటి రాజాను గెలిపించే బాధ్యత ఎమ్మెల్యేలపై పెట్టారు. ఇప్పటి వరకు ఓటుకు రూ.ఐదు వేలు ఇవ్వడానికైనా సిద్ధమని, కూటమి నాయకులకు కూడా తాయిలాలు ఇస్తానని చెబుతూ వచ్చిన ఆలపాటి ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించారు.

మంత్రి లోకేష్‌తో ఫోన్ చేయించి మరీ..

సీఎం ఎన్నికల బాధ్యతను ఎమ్మెల్యేలపై పెట్టినందున ఆయా నియోజకవర్గాల్లో ఖర్చు కూడా వారే పెట్టుకోవాలని చెబుతుండటంతో రాజా గెలుపు కోసం తామెందుకు ఖర్చు చేయాలని ప్రశ్నిస్తున్నారు. అడ్డం తిరిగిన ఎమ్మెల్యేలకు లోకేష్‌తో ఫోన్లు చేయిస్తున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లాకు చెందిన ఒక ఎమ్మెల్యేకి లోకేష్ ఫోన్‌చేసి మాట్లాడినట్లు తెలిసింది.

కాలువ భూముల్లో అక్రమ తవ్వకాలు



ఉప్పమాగులూరులో పోరంబోకు భూమిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



పొక్లెయిన్ సాయంతో గ్రావెల్ తవ్వకం

- పొక్లెయిన్‌తో తవ్వకం
- రహదారుల నిర్మాణం పేరుతో తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

సాక్షి టాస్క్ ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకులు, సానుభూతిపరులు కొండలు, కొండ పోరంబోకు భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ కాలువ భూమిలోని గ్రావెల్‌ను కూడా వదలడం లేదు. వివరాలు.. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం ఉప్పమాపగులూరు గ్రామం నుంచి రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో బోడికొండ ఉంది. దానికి దిగువ భాగంలోని సర్వే నంబర్ 371లో సుమారు ఎకరా రెవెన్యూ కాలువ పోరంబోకు భూమిని బీసీ వర్గాలకు చెందిన పేదలు ఐదారు దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెవెన్యూ అధికారులు కాలువ పోరంబోకు సంబంధించి ఒక ఎకరం భూమిగా గుర్తించి, ఇది ప్రభుత్వ కాలువ పోరంబోకు భూమి అనే బోర్డు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గ్రామంలో నూతన సీసీ రహదారులు, రహదారులకు ఈ గ్రావెల్‌ను గ్రామానికి చెందిన నేతలు శనివారం నుంచి పొక్లెయిన్‌తో తవ్వి ట్రాక్టర్లతో అక్రమంగా తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

పోరంబోకు భూమి

అది పోరంబోకు భూమి. ఆ భూమిలో మెరక ఉండటం వల్ల చుట్టూ ఉన్న పొలాల రైతులు ఇబ్బందికరంగా ఉందని చెప్పడంతో, గ్రామానికి సంబంధించి రోడ్లకు తరలించడానికి అనుమతించాం. రవినాయక్, తహసీల్దార్

జలవనరుల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల: భూగర్భ జలాల పెరుగుదలకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. భూగర్భ జలాల పెరుగుదలపై సంబంధిత శాఖల అధికారులతో శనివారంకలెక్టరేట్ ఛాంబర్‌లో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జలవనరులను సంరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ చెప్పారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ భవనాలపై కురిసే వర్షపు నీరు నేరుగా భూమిలోకి వెళ్లేలా ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. ప్రజాప్రయోజనం కోసం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇంకుడు గుంత నిర్మాణంపై ఆరా తీశారు. 261 ఇంకుడు గుంతలు నిర్మాణం లక్ష్యం, అందులో 112 పూర్తికాగా, 129 నిర్మాణంలో ఉన్నాయన్నారు. మిగిలిన 18 ఇంకుడు గుంతల నిర్మాణాలకు భూసేకరణ చేపడుతున్నామని పంచాయతీరాజ్ ఎస్‌ఈ వివరించారు. లక్ష్యాలను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈని కలెక్టర్ ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 190 మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంకాగా పూర్తి చేసినట్లు గ్రామీణ నీటి సరఫరా అధికారులు వివరించారు. తాగునీటి సరఫరాలో ఇచ్చిన లక్ష్యాలను కూడా పూర్తి చేశామని చెప్పారు. పెండింగ్ పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. 27 అంగన్‌వాడీ కేంద్రాలలో విద్యుత్ కనెక్షన్లను ఈనెలాఖరికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలను ఈ నెలాఖరులోపు పూర్తి చేసి నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమా, పంచాయతీరాజ్ ఇన్‌చార్జి ఎస్ఈ జి రతన్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మాధవి, ఏపీసీపీడీసీఎల్ డీఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో తనిఖీలు
- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలకు ఆదేశం



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి డోలా

రేపల్లె రూరల్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి హెచ్చరించారు. రేపల్లె పట్టణంలోని 2వ వార్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల వసతి గృహాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహం పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటరు కొన్ని రోజులుగా పనిచేయటంలేదని, మూడో ఫ్లోర్ వరకు నీరు మోసుకుని వెళ్లాల్సి వస్తోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్న ప్రిన్సిపల్ గిరిజాకుమారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా కలెక్టర్‌కు సూచించారు. మంత్రి మాట్లాడుతూ వసతి గృహాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. గత ప్రభుత్వం మెయింటినెన్స్ గ్రాంట్‌లను నిలుపుదల చేయటంతో వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే రూ.10లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. మరమ్మతులకు గురైన మోటరు, ఆర్వో ప్లాంట్‌లను వెంటనే బాగు చేయించటంతోపాటు నూతన ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. తరగతుల వారీగా విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. పది, ఇంటర్ పరీక్షలలో నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వసతి గృహంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటోను ఇంకా ఎందుకు తొలగించలేదు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల ఫొటోలు ఎందుకు ఏర్పాటు చేయలేదంటూ ప్రిన్సిపాల్ గిరిజాకుమారిని ప్రశ్నించారు. వెంటనే సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

బంగారం దోపిడీ కేసులో ఏడుగురు అరెస్ట్

4.80 కిలోల పుత్తడి, రూ.2 లక్షలు, రెండు బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మంగళగిరి ఆత్మకూరు అండర్ పాస్ వద్ద బంగారం దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ శనివారం తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో ట్రైనీ ఐపీఎస్ దీక్ష, జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఏటీవీ రవికుమార్ (ఎల్/ఓ)తో కలిసి ఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఆయన కథనం ప్రకారం... మంగళగిరి వీవర్స్‌కాలనీకి చెందిన దివి రాము విజయవాడ జైహింద్ కాంప్లెక్స్‌లో డీవీఆర్ బంగారం దుకాణం నిర్వహించేవాడు. 4.80 కిలోల బంగారు వస్తువులను అతని దుకాణంలో తయారు చేయించాడు. వాటిని సంచిలో పెట్టి మంగళగిరిలోని ఇంట్లో అప్పగించాలని ఈ నెల 15వ తేదీన దుకాణంలో పనిచేసే సమీప బంధువైన దివి నాగరాజుకు అందించాడు. అదేరోజు రాత్రి సుమారు 9.23 గంటలకు యజమానికి నాగరాజు ఫోన్ చేశాడు. ఆత్మకూరు అండర్ పాస్ వద్ద బంగారు వస్తువుల సంచిని దుండగులు దోచుకెళ్లారని పేర్కొన్నాడు. రాము ఘటనా స్థలానికి చేరుకున్నాడు. అనంతరం నాగరాజుతో కలిసి మంగళగిరి రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆరు ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలించారు. నాగరాజు తీరుపై పోలీసులకు అనుమానం కలిగింది. లోతుగా దర్యాప్తు చేశారు. మంగళగిరి టిప్పర్లబజార్‌కు చెందిన నాగరాజుతోపాటు అదే దుకాణంలో పనిచేసే విజయవాడ పాయకాపురం వాసి అడపాల భరత్, అతని మిత్రులైన విజయవాడ భవానీపురం వాసి కొరివి నవీన్, చిట్టినగర్‌కు చెందిన వి.మోహన్, విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన లోకేష్‌లు ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు. నాగరాజు, భరత్, నవీన్, మోహన్, లోకేష్‌తోపాటు రిసీవర్లైన విజయవాడ గొల్లపూడి సెంటర్‌కు చెందిన పి.చంద్రశేఖర్, విజయవాడ చెంచుపేటకు చెందిన శిఖామణి అరుణ్‌కుమార్‌ను అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ చెప్పారు. వారి నుంచి 4.80 కిలోల బంగారం వస్తువులు, రూ.2 లక్షల నగదు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విజయవాడ సితార సెంటర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ పరారీలో ఉన్నాడని పేర్కొన్నారు. పట్టుబడిన ఐదుగురు స్నేహితులు. దోపిడీకి రూపకర్త భరత్ అని వెల్లడైంది. పరారీలో ఉన్న ఇర్ఫాన్‌పై కేసు ఉందని, మిగతా వారిపై పాత కేసుల్లేవని చెప్పారు. దోచుకున్న ఆభరణాలలో కొన్నింటిని లోకేష్ ఇంట్లోని ఓ టైర్‌లో భద్రపరిచారు. కొన్నింటిని ముద్దలుగా కరిగించారు. జీవితంలో స్థిరపడాలనే దురాశతో ఈ పథకానికి రూపకల్పన చేసినట్లు విచారణలో వెల్లడైంది. సాంకేతిక పరిజ్ఞానంతోపాటు సీసీ కెమెరాల ఫుటేజీల సహాయంతో నిందితులను పట్టుకున్నారు.

గ్రూప్‌-2పై కూటమి సర్కారు రాజకీయాలు

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తడాఖా చూపిస్తాం
- నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కేవీ సుబ్రహ్మణ్యం

గుంటూరుఎడ్యుకేషన్:గ్రూప్‌–2మెయిన్స్ రోస్టర్ విధానంలో జరిగిన తప్పులను సవరించిన తరువాతే పరీక్ష నిర్వహించాలని అభ్యర్థులు చేసిన ఆందోళనలను పట్టించుకోకుండా ప్రభుత్వం, ఏపీపీఎస్సీ కలసి రాజకీయాలు చేస్తున్నాయని నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కేవీ సుబ్రహ్మణ్యం శనివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఏకపక్షంగా పరీక్ష నిర్వహించేందుకు మొగ్గు చూపడమంటే అభ్యర్థులను మోసగించడమేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి ఈనెల 27వ తేదీన జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. గ్రూప్‌–2 మెయిన్స్ జరుగుతుందా? లేదా? అనే సందేహంతోనే అభ్యర్థులు మానసికంగా నలిగిపోయారని తెలిపారు. ప్రభుత్వ తీరుతో విసుగు చెందారని ఆరోపించారు. రోస్టర్ విధానంతో అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని, దానిని సవరించి పరీక్ష నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షను వాయిదా వేసే అధికారం ఉన్న ప్రభుత్వం... ఏపీపీఎస్సీకి లేఖ రాసి తన బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్‌–2 మెయిన్స్‌కు దరఖాస్తు చేసిన 92 వేల మంది అభ్యర్థులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పని చేస్తారని తెలిపారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ 'వీక్షణం'కు రెండు కవితలు ఎంపిక

అద్దంకి: సాహితీ గవాక్షం ఆధ్వర్యంలో కాలిఫోర్నియాలో త్వరలో వీక్షణం (సాహితీ గవాక్షం) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి దేశంతో పాటు, విదేశాల్లోని కవుల నుంచి 150 కవితలను ఎంపిక చేశారు. ఇందులో అద్దంకికి చెందిన ఉపాధ్యాయుడు కవి చందలూరి నారాయణరావు రాసిన చెట్టు కళేబరం, ఆర్‌వీ రాఘవరావు రాసిన ప్రస్థానం అనే కవితలు ఎంపికయ్యాయి. ఈ మేరకు చందలూరి నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమకు ఆ సంస్థ వారి నుంచి లిఖితపూర్వక పత్రం అందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన సాహితీవేత్తలు, కవులు శనివారం ఇద్దరినీ అభినందించారు. నారాయణరావు ఇప్పటికే 'మనిషి గుర్తుల్ని బతికించుకుందాం' అనే కవితా సంపుటితో పాటు 'మనం కాసేపు మాట్లాడుకుందాం' అనే కవిత ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక అధికారి నియామకం



అమర్తలూరు(వేమూరు): గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి మహా శివరాత్రి ఉత్సవాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా తెనాలి వైకుంఠపురం ఆలయ సహాయ కమిషనర్ అనుపమ నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అజాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అనుపమ మాట్లాడుతూ బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి తిరునాళ్లను ఈ నెల 26న నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

'లక్ష'ణంగా 'విస్తరి'ంచిన సేవ

- గత ఏడు సంవత్సరాలుగా శ్రీశైలం అన్నదానానికి లక్ష విస్తరాకులు
- దేవాలయాలకు హుండీలు, వాటర్ కూలర్లు, పశువులకు గ్రాసం పంపిణీ



పట్టుచీరపై లలితా సహస్రనామాలను ఎంబ్రాయిడరీ చేసి దేవస్థానానికి అందిస్తున్న సభ్యులు

చీరాల అర్బన్: చీరాలకు చెందిన అబ్బరాజు శ్రీనివాసకుమార్, ఎంపీఎస్ మహాలక్ష్మితో పాటు మరికొందరు ఆధ్యాత్మిక సేవ చేయాలనే తలంపుతో శ్రీ భ్రమరాంబ సేవా సమితిని ప్రారంభించారు. ఇరవై మందితో 2016 ఫిబ్రవరిలో ప్రారంభమైన సమితి సభ్యులు సంఖ్య రెండు తెలుగు రాష్ట్రాల్లో 20వేల మందికి పెరిగింది. గ్రూపు రాష్ట్రంతో పాటు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరించింది. సభ్యుల ఆధార్, ఫొటోలు తీసుకుని ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు అందించారు. శ్రీశైలం, త్రిపురాంతకం, విజయవాడ, శ్రీకాళహస్తి, మంత్రాలయం, కాణిపాకం, బాసర, అరుణాచలం, శృంగేరి, కంచి దేవాలయాల్లో స్వచ్ఛందంగా సేవలు నిర్వహిస్తున్నారు. శ్రీశైలం దేవస్థానంలోని గోశాలకు ప్రతి ఏటా లక్ష రూపాయల విలువైన గ్రాసం అందిస్తున్నారు.

భక్తులకు అన్న ప్రసాదం

ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తుంటారు. ఈ కార్యక్రమంలో తమ వంతుగా అన్నప్రసాదానికి విస్తరాకులను శ్రీభ్రమరాంబిక సేవా సమితి ఆధ్వర్యంలో దేవాలయాలకు అందిస్తున్నారు. 2016లో సభ్యులు, దాతల సహకారంతో తిరుమల క్షేత్రంలో అన్నప్రసాదానికి రూ.1.50లక్షల విలువైన విస్తరాకులను అందించారు. 2019 నుంచి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీశైల దేవస్థానానికి లక్ష విస్తరాకులను అందించారు. శ్రీశైలంలోని గోశాలకు లక్ష రూపాయల విలువైన గ్రాసాన్ని దేవాలయానికి అందించి ఈఓ ప్రశంసలను పొందారు. గత ఏడు సంవత్సరాలుగా విస్తరాకులను దేవస్థానానికి అందించారు. మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి, అమ్మవారికి పట్టువస్త్రాలు, అలంకరణ సామగ్రిని అందిస్తున్నారు. శ్రీశైల దేవస్థానానికి నిత్యాన్నదానికి రూ.1.50లక్షల విలువైన వంట సామగ్రి అందించారు. కరోనా సమయంలో రూ.1.20లక్షల విలువైన చల్లని, వేడి నీటి యంత్రాలను అందించారు. విలువైన వస్తువులు వితరణతో పాటు పలు దేవస్థానాలకు ఇత్తడి హుండీలను అందించారు. హుండీలో నగదు లెక్కించేందుకు వీలుగా కౌంటింగ్ మిషన్లను దేవాలయాలకు అందించారు. పట్టణంలోని పాపరాజుతోటకు చెందిన చుండూరి సరస్వతి భ్రమరాంబ సేవా సమితి తరఫున అమ్మవారికి పట్టుచీరపై లలిత సహస్రనామాలను ఎంబ్రాయిడరీతో చేసి అమ్మవారికి సమర్పించారు. సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని సమితి కార్యదర్శి అబ్బరాజు శ్రీనివాసకుమార్, కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.



శ్రీశైలం దేవస్థానానికి లక్ష విస్తరాకులను అందిస్తున్న సభ్యులు

ఎక్సైజ్ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా గుంటూరు–2 ఎక్సైజ్ స్టేషన్ సీఐ ఎం.యశోదరాదేవి ఎన్నికయ్యారు. శనివారం బ్రాడీపేటలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఈ ఎన్నికలు జరిగాయి. సత్తెనపల్లి ఎక్సైజ్ స్టేషన్ సీఐ విజయకుమార్‌తో ఎం.యశోదరాదేవి పోటీపడి గెలిచారు. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎస్.పి.సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్‌గా కె.కర్ణ, జనరల్ సెక్రటరీ పి.ఆర్.కె.మూర్తి, జాయింట్ సెక్రటరీగా కళ్యాణ్‌చక్రవర్తి, ట్రెజరర్‌గా పి.కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శ్రీనివాసరావు, ఎం.శివరామ్‌ప్రసాద్, లక్ష్మి, పి.ఫణికుమార్‌లు ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రతినిధులు

రెండు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మేదరమెట్ల: బైక్‌ను పాల ట్యాంకర్ ఢీకొనడంతో భార్యాభర్తలు గాయపడ్డారు. వెంకటాపురం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కొండమూరు గ్రామానికి చెందిన ఓరుగంటి అంజిరెడ్డి భార్యతో కలిసి బైకుపై ఒంగోలు నుంచి స్వగ్రామం వెళుతున్నారు. వెంకటాపురం క్రాస్ రోడ్డు సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన పాల ట్యాంకర్ బైక్‌ను బలంగా ఢీకొంది. భార్యాభర్తలను అంబులెన్స్‌లో ఒంగోలు కిమ్స్ వైద్యశాలకు తరలించినట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు.

జె.పంగులూరులో..

టైరు పగిలి ఆగి ఉన్న వ్యాన్‌ను లారీ ఢీకొనడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి బైటమంజులూరు జాతీయ రహదారిపై జరిగింది. అద్దంకి మండలం వెంకటాపురం నుంచి పొగాకు చెక్కులతో వ్యాన్ బయలుదేరింది. బైటమంజులూరు సమీపంలో టైరు పగిలిపోగా రోడ్డుపై ఆగింది. అదే సమయంలో మైసూర్ నుంచి భువనేశ్వర్ వెళ్తున్న లారీ వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీని నడుపుతున్న బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



వెంకటాపురం క్రాస్‌రోడ్డు సమీపంలో గాయపడిన భార్యాభర్తలు



జాతీయ రహదారిపై ఫోర్ వీల్ ఆటోను ఢీ కొన్న లారీ

కిడ్నాప్, హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్

తెనాలి రూరల్: కలప వ్యాపారిని కిడ్నాప్ చేసి, హత్యాయత్నం చేసిన కేసులో కౌన్సిలర్ సహా ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్. రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. పట్టణ బాలాజీరావుపేటకు చెందిన షేక్ మస్తాన్‌వలి మార్కెట్ ఏరియాలో టింబర్ డిపో నడుపుతున్నాడు. ఇతన్ని పట్టణానికి చెందిన కౌన్సిలర్ మొగల్ అహ్మద్ కొంత కాలంగా డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాడు. నిరాకరించడంతో కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 5వ తేదీన గుంటూరుకు చెందిన తనకు పరిచయస్తులైన ముగ్గురు వ్యక్తులతో కలసి తెనాలి వచ్చి, ఇక్కడి పడమర కాల్వకట్ట రోడ్డులోని ఓ కోత మిషన్ వద్ద ఉన్న మస్తాన్ వలిని కారులో బలవంతంగా ఎక్కించుకుని తీసుకెళ్లాడు. కారులో దాడి చేసుకుంటూ తక్కెళ్లపాడు తీసుకెళ్లి అక్కడ హైవే పక్కన పెట్రోలు బంకులో కారులో రూ. ఐదు వేలకు డీజిల్ కొట్టించి మస్తాన్‌వలితో బలవంతంగా డబ్బు కట్టించారు. అక్కడి నుంచి విజయవాడ తీసుకెళ్లి భవానీపురంలో మద్యం, కిళ్లీలు బాధితుడితో కొనుగోలు చేయించి అతన్ని చిత్రహింసలు పెడుతూ పలు ప్రదేశాల్లో తిప్పారు. తనని, తన కుటుంబాన్ని అంతం చేస్తామని నిందితులు బెదిరించడంతో డబ్బు ఇచ్చేందుకు బాధితుడు అంగీకరించాడు. తెనాలి తీసుకువచ్చి బాలాజీరావుపేటలో కారులో నుంచి బయటకు నెట్టేసి వెళ్లిపోయారు. గాయాలతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చేరిన మస్తాన్‌వలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ ఎస్ఐ నక్కా ప్రకాశరావు కేసు నమోదు చేశారు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. బాలాజీరావుపేట వద్ద అహ్మద్ ఉన్నాడన్న సమాచారంతో ఎస్ఐ, సిబ్బంది పి. మురళి, కె. బాబురావు, ఎస్. జయకర్, ఎన్. శ్రీనివాసరావు, డి. సురేష్‌బాబులు వెళ్లి అతన్ని, నిందితుల్లో ఒకడైన గుంటూరు బ్రాడీపేటకు చెందిన డిగ్రీ విద్యార్థి షేక్ రెహమాన్‌ను అరెస్టు చేశారు. కిడ్నాప్‌నకు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులైన గుంటూరుకు చెందిన షేక్ ఇర్ఫాన్ అలియాస్ హైదరాబాద్, షేక్ హుమయూన్ అలియాస్ చిష్టి పరారీలో ఉన్నారని, త్వరలో వారిని కూడా అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు. సీఐ, ఎస్ఐ, సిబ్బందిని డీఎస్పీ బి. జనార్దనరావు అభినందించారు. సమావేశంలో ఎస్ఐ ప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు

ఆయిల్ మిల్లుల్లో అధికారుల తనిఖీలు

- ఎనిమిది చోట్ల తనిఖీ
- అన్నిచోట్లా శుభ్రత లేని ట్యాంకులే..
- కేసులు నమోదు చేసిన అధికారులు



తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ

నరసరావుపేట టౌన్: రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డిప్యూటీ కమిషనర్ పూర్ణచంద్రరావు ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ఎనిమిది ఆయిల్ మిల్లుల్లో తనిఖీలు చేశామని స్థానిక ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దాడులు అనంతరం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. నాలుగు జిల్లాల నుంచి ఎనిమిది మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను ఎనిమిది టీంలుగా ఏర్పాటుచేసి నరసరావుపేట ప్రాంతంలోని రీప్యాక్ ఆయిల్ మిల్లులను తనిఖీ చేశామన్నారు. ఎక్కడా ట్యాంకుల శుభ్రత కనిపించలేదున్నారు. వీరందరికీ నోటీసులు ఇవ్వటం జరుగుతుందని, అనుమానాస్పదంగా ఉన్న నూనె శాంపిల్స్ తీయటం జరిగిందన్నారు. వీటిని పరీక్షలకు పంపిస్తున్నామని, ఎక్కడ లోపం కన్పించినా వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. వీరందరిపై నిరంతర నిఘా కొనసాగిస్తామన్నారు. వీరందరిపై ఎనిమిది కేసులు నమోదు చేశామన్నారు. మేము నరసరావుపేటలో 24 యూనిట్లకు లైసెన్సులు మంజూరుచేశామని, అన్నింటినీ తనిఖీ చేస్తామన్నారు. రిటైలర్లు, శనగనూనె మిల్లులపై కూడా చర్యలు తప్పక ఉంటాయని తెలిపారు.

'ఉయ్యాలవాడ' త్యాగం అసమానం



ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆర్‌బీజీ గ్రూపు సభ్యులు

నరసరావుపేట: ఆంగ్లేయుల దుష్ట పాలనపై తాంతియా తోపే, ఝాన్సీ లక్ష్మీబాయిల కన్నా ముందే కత్తిదూసి, పోరాడి ఉరికంభం ఎక్కిన స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి కొనియాడారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లో శనివారం రెడ్డి బిజినెస్ గ్రూపు (ఆర్‌బీజీ) ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చినరామిరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం, దేశ స్వాతంత్ర్య సాధన కోసం ప్రాణాలర్పించిన రేనాటి వీరుడు ఉయ్యాలవాడ అని పేర్కొన్నారు. ప్రస్తుత తరానికి, యువతకు ఆయన పోరాటాన్ని వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. న్యాయవాది ఆరెకూటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లదొరలపై అలుపెరగని పోరాటంచేసి అసువులు బాశారని తెలిపారు. మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ బ్రిటిష్ పాలనపై పోరాటాలు చేసిన తెలుగు వీరుడని పేర్కొన్నారు. ఎల్ఐసీ ఏజెంట్ తియ్యగూర వీరారెడ్డి, ఇదా లింగారెడ్డి, వి.పెద్దిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహనకృష్ణారెడ్డి, తుమ్మూరు శ్రీనివాసరెడ్డి, జీవీ సాంబశివరెడ్డి, యర్రంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రయం కేసులో నిందితుల అరెస్టు

ముండ్లమూరు (కురిచేడు): గంజాయి విక్రయం కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం వివరాలను ఆయన వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న ముండ్లమూరు మండలం ఈదరకు చెందిన బడా లక్ష్మీనారాయణ, మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన జడా శ్రీహరి, అదే గ్రామానికి చెందిన మొగిలి వంశీ, ఉప్పు శివగోపీలను మండలంలోని వేంపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఎస్ఐ వై.నాగరాజు సిబ్బందితో కలసి అరెస్టు చేశారు. నిందితుడు లక్ష్మీనారాయణపై గతంలో మార్టూరు, చీరాల టౌన్, నరసరావుపేట– 2 టౌన్ పోలీసుస్టేషన్లలో గంజాయి కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు. ఉప్పు శివగోపీపై వేటపాలెం పోలీసుస్టేషన్‌లో గంజాయి కేసు, జడా శ్రీహరిపై మార్టూరు పోలీస్‌స్టేషనులో వివిధ కొట్లాట కేసుల నమోదైనట్లు తెలిపారు. తాజాగా అంతా కలిసి కొంతకాలంగా సామర్లకోటకు చెందిన ఒక వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నారు. బాపట్ల జిల్లాలోని మార్టూరు, ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వారికి తెలిసిన వ్యక్తుల ద్వారా అమ్ముతున్నారు. దర్శి సీఐ రామారావు, ముండ్లమూరు ఎస్ఐ నాగరాజులకు సమాచారం రావడంతో వారి కదలికలపై నిఘా పెట్టారు. శుక్రవారం ఈదరకు వచ్చి తిరిగి ఒంగోలు వెళ్తుండగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. నిందితుల వద్ద నాలుగు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దర్శి సీఐ రామారావు కేసు దర్యాప్తు చేపట్టి ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొరిటెపాడు: బ్యాంకింగ్ పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ఇదే డిమాండ్‌తో ఈ నెల 24, 25వ తేదీల్లో చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అనుబంధంగా ఉన్న ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ కమిటీ సమావేశం శనివారం గుంటూరులోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. కార్యవర్గ సమావేశాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ, ఏపీ రాష్ట్ర కౌన్సిల్ కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి యూనియన్ ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ అన్ని బ్యాంకుల్లో లక్షల ఖాళీలు ఉన్నాయని, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలోని ప్యారీ స్కూల్ ఆఫ్ కామర్స్, కామర్స్ విభాగం ప్రొఫెసర్ ఎ. వెంకటాచలం బ్యాంకింగ్ సేవలలో ఆల్ అప్లికేషన్ – ఎథికల్ గవర్నెన్స్, విజిలెన్స్ అనే అంశంపై ప్రసంగించారు. ఏఐటీయూసీ ఏపీ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ రాధాకృష్ణమూర్తి, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజిరెడ్డి వజ్రాల మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం–ప్రజాస్వామ్యం– కార్మిక సంఘాల పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.ఎస్.కుమార్, గుంటూరు జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమితి అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, కార్యదర్శి బాషా, కమిటీ మాజీ కార్యదర్శి కాం.కిషోర్, జాయింట్ జనరల్ సెక్రటరీ కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.రామకృష్ణ

సాయం పేరిట ఖర్చుపై హైకోర్టులో వ్యాజ్యం

దాఖలు చేసిన గుంటూరు డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: విజయవాడ బుడమేరు బాధితులకు గుంటూరు కార్పొరేషన్ తరఫున చేసిన సాయం దారి మళ్లించారనే అనుమానాల నేపథ్యంలో ఈ అంశాన్ని కోర్టులో తేల్చుకోవడానికి డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు సిద్ధం అయ్యారు. దీనిపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది సోమవారం విచారణకు రానుంది. వరద బాధితుల పేరుతో ఎవరి అనుమతి లేకుండానే మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఏకపక్షంగా ఖర్చు చేయడమే కాకుండా, రూ.9.22 కోట్లను కాంట్రాక్టర్లకు చెల్లించేశారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై కౌన్సిల్‌లో ప్రశ్నించగా ఆ అంశం చర్చకు రాకముందే అధికారులు మరో అంశంపై కౌన్సిల్‌ను బాయ్‌కాట్ చేశారు. తర్వాత కౌన్సిల్ సమావేశం పెట్టడానికి ముందుకు రాకుండానే స్థాయీ సంఘం ఎన్నికలకు వెళ్లడం తెలిసిందే. అధికారులు చూపిన లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే ఖర్చు పెట్టిన మొత్తం రూ.కోటిన్నర కూడా దాటదని పిటిషన్‌లో డైమండ్ బాబు పేర్కొన్నారు. మున్సిపల్ మంత్రి నుంచి తమకు వచ్చిన ఫోన్ ఆదేశాల మేరకు సహాయం అందించామని మున్సిపల్ కమిషనర్ పేర్కొంటే, గుంటూరు జిల్లా కలెక్టర్ నుంచి ప్రభుత్వానికి రాసిన లేఖలో దీనికి విరుద్ధంగా ఉందన్నారు.

ఇంత మొత్తం ఖర్చు చేయాలంటే కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆమోదం తీసుకోవాలని గుర్తుచేశారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి ఆడిట్, విచారణ నిర్వహించి దారి మళ్లించిన మొత్తాన్ని మున్సిపల్ కమిషనర్ నుంచి రికవరీ చేయాలని కోరారు. కిందిస్థాయి ఉద్యోగులకు రూ.1.59 కోట్లను అడ్వాన్స్ కింద చెల్లించడం కూడా చట్ట విరుద్ధమైనందున క్రిమినల్ ప్రొసీడింగ్స్ చేపట్టాలని విన్నవించారు.